# నేటి యువతకు ప్రేరణ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్

## (22 డిసెంబర్ : "జాతీయ గణితశాస్త్ర దినోత్సవం" సందర్భంగా)

భారతీయ గణితశాస్త్ర మేధావి శ్రీనివాస రామానుజన్ 125వ జయంతి సందర్భంగా 2012లో నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ప్రకటనకు స్పందనగా ప్రతి ఏట 22 డిసెంబర్‌న దేశవ్యాప్తంగా విద్యాలయాలు, యూనివర్సిటీలు, పౌరసమాజం ఘనంగా "జాతీయ గణితశాస్త్ర దినోత్సవం (నేషనల్ మ్యాథమాటిక్స్ డే)" నిర్వహించడం కొనసాగుతున్నది. మానవ జీవన విధానంతో పాటు శాస్త్రసాంకేతిక అభివృద్ధికి గణితశాస్త్రం నిర్వహిస్తున్న పాత్రను ప్రచారం చేయడం, యువతతో పాటు విద్యార్థిలోకంలో రామానుజన్ స్ఫూర్తిని రగల్చడానికి జాతీయ గణితశాస్త్ర దినం దోహదపడే విధంగా నిర్వహించడం జరుగుతోంది. అతి క్లిష్టమైన సంఖ్య సిద్ధాంతం, అనంత శ్రేణులు, కంటిన్యూడ్ ఫ్రాక్షన్స్, పార్టీషన్ థియరీ, రామానుజన్ నెంబర్ లాంటి పలు గణిత సూత్రాలను ప్రతిపాదించిన శ్రీనివాస రామానుజన్ గణిత ప్రతిభకు ప్రపంచ గణిత శాస్త్రవేత్తలు సహితం తమ అంగీకారాన్ని తెలుపడంతో భారతీయులందరికీ గర్వకారణం. ఉన్నత పాఠశాల విద్యను సహితం చక్కగా అభ్యసించని బాల గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ చూపిన గణిత ప్రతిభ మనల్ని ఆశ్చర్యానికి గురి చేస్తున్నది.

### బాల మేధావి రామానుజన్:

22 డిసెంబర్ 1887న నేటి తమిళ నాడు ఈరోడ్ పట్టణంలోని తమిళ అయ్యంగార్ బ్రాహ్మణ కుటుంబంలో కమలతమ్మల్ – కుప్పుస్వామి దంపతులకు జన్మించిన శ్రీనివాస రామానుజన్ చిన్నతనం నుంచే స్వయం–శిక్షణతో గణితంలో రాణించడం జరిగింది. పాఠశాల విద్యను కూడా ఒక పద్ధతిలో అభ్యసించక పోవడం, ఇతర సబ్జెక్టుల్లో మక్కువ చూపకపోవడంతో ఎలాంటి పట్టా పొందలేక పోయారు. తన 11వ ఏటి నుంచే త్రికోణమితి, జ్యామితి లాంటి గణిత అంశాల్లోఅత్యంత ప్రతిభ కనబర్చుతూ పలు గణిత ప్రతిపాదనలు చేస్తూ అనేక గుర్తింపులు పొందడం జరిగింది. మద్రాస్ యూనివర్సిటీ నుంచి స్కాలర్‌షిప్ పొందిన రామానుజన్ ఇతర సబ్జెక్టుల్లో ఆసక్తి చూపకపోవడంతో డిగ్రీ పొందలేకపోయారు. 1911లో ఇండియన్ మ్యాథ్స్ జర్నల్‌లో పరిశోధన వ్యాసాన్ని సమర్పించినా రామానుజన్ ప్రపంచ గణిత మేధావుల దృష్టిని ఆకర్షించగలిగారు.

### ఇంగ్లాండ్‌లో రామానుజన్ పరిశోధనలు:

1913లో బ్రిటీష్ గణిత శాస్త్రవేత్త జిహెచ్ హార్డీ దృష్టిని ఆకర్షించిన శ్రీనివాసన్ రామానుజన్ కేంబ్రిడ్జ్ ట్రినిటీ కళాశాల స్కాలర్‌షిప్‌ను పొంది 1914లో ఇంగ్లాండ్‌కు చేరి హార్డీతో కలిసి గణిత పరిశోధనలు చేయడం ప్రారంభించాడం, తాను ప్రతిపాదించిన గణితశాస్త్ర సిద్ధాంతాలు పలు అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితం కావడం, 1918లో రాయల్ సొసైటీ ఆఫ్ లండల్ సభ్యత్వం పొందడం జరిగింది. 1917లో టీబీ సోకడం, అనారోగ్యాల పాలుకావడంతో 1919లో భారత్‌కు తిరిగి వచ్చారు. తన 32వ ఏట 26 ఏప్రిల్ 1920 రోజు తుది శ్వాస విడిచిన రామానుజన్ రాసిన మూడు నోట్‌బుక్స్‌లో ప్రతిపాదితమయిన పలు గణిత అంశాలు నేటికీ శాస్త్రవేత్తలకు నేటికీ కొరకరాని కొయ్యలుగానే మిగిలిపోయాయి.

రామానుజన్ 137వ జన్మదిన వేడుకల శుభవేళ నేడు సమస్త భారత పౌర సమాజంతో పాటు ప్రపంచ ప్రఖ్యాత గణితవేత్తలా సహితం శ్రీనివాసన్ ప్రతిభకు సలాంలు కొడుతున్నారు. మూడు దశాబ్దాల కొద్ది కాలం పాటు మాత్రమే జీవించిన రామానుజన్ ప్రపంచ గణితశాస్త్ర పేజీల్లో సుస్థిర స్థానాన్ని పదిల పరుచుకొని ప్రపంచ యువతకు మార్గదర్శకులుగా, గణితశాస్త్ర అధ్యయనశీలురకు కూడా దేదీప్యమాన దారి దీపంగా నిలుస్తున్నారు.

– డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# సమాచార శాఖ ప్రచురించే అరుదైన పుస్తకాలు ఉద్యోగార్థులకు ఎంతో ఉపయుక్తం

**-తద్వారా ముఖ్యమైన అంశాలపై అవగాహన పెంపొందించుకోవచ్చు:పీఐబీ ఏడీజీ శ్రుతి పాటిల్**

**-37వ హైదరాబాద్ పుస్తక ప్రదర్శనలో ప్రచురణల విభాగం స్టాల్ ప్రారంభం**



హైదరాబాద్, డిసెంబర్ 21: హైదరాబాద్ లోని ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటైన పుస్తక ప్రదర్శనలో కేంద్ర సమాచార, ప్రసార శాఖ మీడియా విభాగానికి చెందిన ప్రచురణల విభాగం స్టాల్ ను హైదరాబాద్ పీఐబీ (పత్రికా సమాచార కార్యాలయం) అదనపు డైరెక్టర్ జనరల్ శ్రీమతి శ్రుతి పాటిల్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా శ్రీమతి పాటిల్ మాట్లాడుతూ, పబ్లికేషన్స్ డివిజన్ (ప్రచురణల విభాగం) అనేది భారత ప్రభుత్వానికి చెందిన ముఖ్యమైన పుస్తక ప్రచురణ విభాగమని, ప్రభుత్వ పథకాల గురించి సమగ్రమైన సమాచారాన్నందించే కీలకమైన పత్రాలను, పుస్తకాలను ఈ విభాగం ప్రచురిస్తుందని వెల్లడించారు. జాతీయ ప్రాముఖ్యం గల వారసత్వం, భారతీయ విలువలు వంటి అంశాల నుంచి సమకాలీన అంశాల వరకూ విభిన్నమైన ఇతివృత్తాలు గల పుస్తకాల ప్రచురణలను ఈ విభాగం చేపడుతుందని చెప్పారు. ఆర్థిక ప్రగతి, గ్రామీణ పునరుజ్జీవనం, సామాజిక అభివృద్ధి, సాహిత్యం, సంస్కృతి, బాల సాహిత్యం, ఉపాధి సంబంధిత సమాచారం వంటి భిన్న అంశాలకు సంబంధించిన పుస్తకాలను ఈ శాఖ ప్రచురిస్తోందని వెల్లడించారు.

ముఖ్యమైన అంశాలపై అవగాహనను పెంపొందించుకునేందుకు ఈ పుస్తకాలను చదవాలని శ్రీమతి శ్రుతి పాటిల్ యువతకు, ఉద్యోగార్థులకు సూచించారు.



గాంధేయ సాహిత్యం, స్వాతంత్ర్య సమరయోధులు, కళలు, చరిత్ర, రక్షణ, రాష్ట్రపతి భవన్, రాష్ట్రపతి, ప్రధానమంత్రుల ప్రసంగాలు, బాల సాహిత్యం వంటి అనేక రంగాలకు చెందిన విలువైన పుస్తకాలు స్టాల్ లో అందుబాటులో ఉంటాయని ప్రచురణల విభాగం సహాయ డైరెక్టర్ శ్రీ మహమ్మద్ సిరాజుద్దీన్ తెలియజేశారు. హైదరాబాద్ పుస్తకప్రదర్శన లోని 101, 102 నంబరు స్టాళ్ళను సందర్శించి, ప్రచురణల విభాగం అందించే రాయితీలను వినియోగించుకుని పుస్తకాలను కొనుగోలు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రత్యేక పుస్తకాలపై 90% వరకూ రాయితీ లభిస్తోందని శ్రీ సిరాజుద్దీన్ తెలిపారు.

# ఈ-బస్సులకు గ్రీన్ సిగ్నల్.. పాత, డొక్కు బస్సులకు గుడ్ బై

**-ఏపీలో ఎలక్ట్రిక్ బస్సులకు హాయ్ హాయ్**

**-ఇక డీజిల్ బస్సులన్నింటికీ బై బై**

**-కొత్త బస్సులు తెచ్చేందుకు సర్కారు యత్నాలు**

**-2029 వరకు అన్నీ విద్యుత్ బస్సులే ఉండేలా ప్లాన్ మొత్తం 12,717 బస్సుల కొనుగోలుకు ప్రణాళికలు**

**-తిరుపతికి అదనంగా 300 బస్సులు కేటాయించాలి కేంద్రానికి లేఖ రాసిన సీఎం చంద్రబాబు**

అమరావతి, డిసెంబర్ 21:ఏపీఎస్ఆర్టీసీ విద్యుత్ బస్సుల దిశగా అడుగులు వేస్తోంది. వచ్చే అయిదు సంవత్సరాల్లో డీజిల్ బస్సుల అన్నీ పక్కన పెట్టి వాటి స్థానంలో విద్యుత్ బస్సులు తీసుకోవడానికి అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తెచ్చిన విద్యుత్ వాహనాల విధానం 2024–2029కు అనుగుణంగా 2029 నాటికి సంస్థలో అన్నీ విద్యుత్ బస్సులే నడపాలని ప్రభుత్వం భావిస్తోంది. అప్పటికల్లా ఏపీఎస్ఆర్టీసీ సొంత బస్సులు 10,155, అద్దెవి 2,562 కలిపి మొత్తం 12,717 బస్సులూ విద్యుత్‌వే ఉండాలని అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు.

ప్రస్తుత మోటారు వాహన చట్టం ప్రకారం 15 సంవత్సరాలు దాటిన ప్రభుత్వ వాహనాలను తుక్కు (స్క్రాప్)గా మార్చాలి. వచ్చే అయిదు సంవత్సరాల్లో 2,537 బస్సులకు 15 సంవత్సరాలు దాటుతుంది. వీటినీ తుక్కుగా మార్చి, వాటి స్థానంలోనే విద్యుత్ బస్సులు తీసుకురానున్నారు. 12 లక్షల కిలోమీటర్లు తిరిగిన ఏసీ బస్సులు, 10 లక్షల కిలోమీటర్లు తిరిగిన అల్ట్రా డీలక్స్‌లు, సూపర్ లగ్జరీ, 8 లక్షల కిలోమీటర్లు నడిచిన ఎక్స్‌ప్రెస్‌లు, 6.5 లక్షల కిలో మీటర్లు ప్రయాణించిన తిరుమల ఘాట్ (సప్తగిరి ఎక్స్?ప్రెస్?) సర్వీసులు, 8 లక్షల కిలో మీటర్లు పూర్తి అయిన మెట్రో ఎక్స్‌ప్రెస్‌లు, 12 లక్షల కిలో మీటర్లు దాటిన పల్లె వెలుగు, 13 లక్షల కిలో మీటర్లు తిరిగిన సిటీ ఆర్డినరీ బస్సులను పక్కన పెట్టాలి. వచ్చే ఐదు సంవత్సరాల్లో ఇలాంటివి 5,731 బస్సులను పక్కన పెట్టనున్నారు. 2029లో తీసుకోబోయే 1,285 అద్దె బస్సులు, 2025–29 వరకు కొత్తగా పెంచబోయే 1,698 బస్సులు, 2029లో అదనంగా చేర్చబోయే 2,726 కూడా విద్యుత్ బస్సులే తీసుకుంటారు.

అన్నీ విద్యుత్ బస్సులే తీసుకుంటే ఏపీఎస్ఆర్టీసీకి గిట్టుబాటు అవుతుందా అనే ప్రశ్న ఉత్పన్నం అవుతోంది. అయితే.. ఇందులో అద్దె ప్రాతిపదికన ఎన్ని సొంతంగా కొనేవి ఎన్ని అనేది స్పష్టత రావాల్సి ఉంది. ఒక్కో విద్యుత్ బస్సును 1.80 కోట్ల నుంచి 2 కోట్ల ధర పెట్టి కొనడం ఆర్టీసీకి భారమే అవుతుందని సమాచారం. అయితే.. గతం కంటే విద్యుత్ బస్సుల ధర తగ్గుతోందని, ముందు ముందు మరింత తగ్గవచ్చని అధికారులు అంటున్నారు.ఏపీలో 11 నగరాలకు ప్రధానమంత్రి ఈ–బస్ సేవ పథకం కింద 750 విద్యుత్ బస్సులు అద్దె ప్రాతిపదికన మంజూరు అయ్యాయి. వీటిలో విశాఖపట్నం,విజయవాడ, గుంటూరు, నెల్లూరు నగరాలకు 100 చొప్పున, అమరావతి, కడప, కర్నూలు, అనంతపురం, తిరుపతి, కాకినాడ, రాజమహేంద్రవరం ప్రాంతాలకు 50చొప్పున మంజూరు చేశారు. కేంద్ర ప్రభుత్వం ఒక్కో బస్సుకు 35 లక్షల రూపాయల మేర ఆయా కంపెనీలకు నేరుగా సబ్సిడీ ఇస్తుంది. కేంద్ర గృహ, పట్టణాభివృద్ధి వ్యవహారాలశాఖ వీటికి టెండర్లు పిలిచి, బస్ కంపెనీలను ఎంపిక చేసి, వాటికి కిలో మీటర్లకు ఎంత ధర చొప్పున చెల్లించాలో నిర్ణయిస్తుంది.

# ఆస్ట్రేలియా తెలుగు మహిళల అంతర్జాతీయ చీరల దినోత్సవం హంగామా



అంతర్జాతీయ చీరల దినోత్సవంలో మెరిసిన ఆస్ట్రేలియాలో స్థిరపడిన తెలుగు మహిళలు

హైదరాబాద్, డిసెంబర్ 21:ఆస్ట్రేలియా రాజధాని క్యాన్‌బెరా నగరంలోని హయత్ హోటల్‌లో నిర్వహించిన అంతర్జాతీయ చీరల దినోత్సవంలో భారత దేశ సంతతికి చెందిన మహిళలు అందమైన చీర కట్టుతో వేదికను సుసంపన్నం చేయడం విశేషం. ఆ ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీమతి జానకి కెప్లెన్ డా: బుర్ర మధుసూదన్ రెడ్డి దంపతులు హాజరై భారతీయ మహిళ కే ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న చీరలు ప్రపంచవ్యాప్త మహిళా లోకానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని, పాశ్చాత్య మహిళలు సహితం భారతీయ చీరలు ధరించడానికి ఉత్సాహం చూపిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో 13 ఏండ్ల అభిషా రెడ్డికి తొలి సారి నూతన చీరను ధరింపజేసి "అంతర్జాతీయ చీరల దినోత్సవానికి వన్నెతేవడం సంతోషదాయకమని ముఖ్య అతిథులు అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ వయస్సుల మహిళామణులు తనకు ఇష్టమైన చీరలు ధరించి వేదికపై మెరుపు ప్రదర్శనలు ఇవ్వడం, వారి ఉత్సాహాన్ని చూసి పురుషులు చప్పట్ల దుప్పట్లు కప్పడం జరిగింది. డిజిటల్ యుగం లో భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు మరుగున పడుతున్న వేళ ఆస్ట్రేలియాలో స్థిరపడిన కుటుంబాలు మన పండుగలు, మన దైన కట్టు బొట్టులను కొనసాగించడం హర్షదాయకం అని అన్నారు. ఈ కార్యక్రమంలో పలు క్యాన్‌బెరా నగర తెలుగు కుటుంబాలు పాల్గొని చీరల ఉత్సవానికి రంగులు అద్దారు. ఈ కార్యక్రమ నిర్వకులు శ్రావణి అభిలాష్ రెడ్డి, సుధా రమణి, అవంతి ప్రేమ్, ప్రశాంతి సతీష్‌లతో పాటు పలు కుటుంబ సభ్యులు పాల్గొని చీరల్లో మెరిసి పోయారు.

# కరీంనగర్ వైద్యుడికి ప్రతిష్టాత్మక అవార్డు.. అందజేసిన గవర్నర్



కరీంనగర్, డిసెంబర్ 21:కరీంనగర్ వైద్యుడు అత్యంత ప్రతిష్టాత్మక అవార్డు అందుకున్నారు. ఆసియా టుడే ఇండియా ఆధ్వర్యంలో ప్రతి ఏడాది బహుకరిస్తున్న ప్రైడ్ ఆఫ్ ద నేషన్ అవార్డును తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కరీంనగర్‌కు చెందిన ప్రముఖ ల్యాప్రో స్కోపిక్ సర్జన్ చెట్టుమల్ల ప్రదీప్ కుమార్ కు శనివారం అందజేశారు.

మారుమూల ప్రాంత ప్రజలకు వైద్యుడు అందిస్తున్న సేవలను గవర్నర్ కొనియాడారు. రాబోయే రోజుల్లో మరింత నాణ్యమైన వైద్యాన్ని నిరుపేదలకు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ.. ల్యాప్రోస్కోపిక్ సర్జరీ సేవలను అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు ఈటల రాజేందర్, రఘునందన్ రావు, లక్ష్మణ్ తో పాటు లైఫ్ లైన్ ఆస్పత్రి సీఈవో డాక్టర్ కంచన్ పాల్గొన్నారు.

# సికింద్రాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్మెంట్‌కు భిన్న వర్ణాలతో కూడిన రెజిమెంట్ పతకాలను అందించిన రాష్ట్రపతి

హైదరాబాద్, డిసెంబర్ 21:సికింద్రాబాద్ లోని కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్మెంట్ కు రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము శుక్రవారం భిన్న వర్ణాలతో కూడిన రెజిమెంట్ పతాకాలను అందజేశారు.

ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ, భారత రక్షణ రంగ సామర్థ్యంలో మెరుగుదల దౌత్య, సైనిక భాగస్వామ్యాలను బలోపేతం చేయడంతోపాటు రక్షణ ఎగుమతులను పెంచుతుందన్నారు. ఈ పరిణామాలు అంతర్జాతీయ రక్షణ వేదికపై భారత్ క్రియాశీలంగా వ్యవహరించడంలో కూడా దోహదపడుతాయన్నారు.

సాంకేతికతలో పురోగతి దేశ భద్రతపై అమితంగా ప్రభావం చూపుతుందని రాష్ట్రపతి అన్నారు. అధునాతన సాంకేతికతలు, కొత్త వ్యూహాత్మక భాగస్వామ్యాలు సాంప్రదాయక యుద్ధ స్వభావాన్నీ, విధానాలనూ సవాలు చేస్తున్నాయన్నారు. అధునాతన సాంకేతికతలు, కృత్రిమ మేధలకూ.. దేశ రక్షణ వ్యవస్థలో వాటిని వినియోగించుకునేందుకూ భారత్ అత్యధిక ప్రాధాన్యమిస్తోందని రాష్ట్రపతి తెలిపారు. తద్వారా అంతర్జాతీయ పోటీకి అనుగుణంగా మన సామర్థ్యాన్ని మెరుగుపరుచుకోవడం సాధ్యపడుతుందన్నారు. "సాంప్రదాయిక బలగాలను నవీకరించడంతోపాటు.. కృత్రిమ మేధ, డ్రోన్లు, సైబర్ యుద్ధ సామర్థ్యాలు, అంతరిక్ష రక్షణ సాంకేతికతలు సహా అత్యాధునిక సాంకేతికతలను అందిపుచ్చుకోవడంపై మనం ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నాం" అని రాష్ట్రపతి చెప్పారు.

మన సాయుధ బలగాల సిబ్బంది తాజా సాంకేతిక పురోగతులను అందిపుచ్చుకోవాలనీ, అలాగే కార్యాచరణలో మారుతున్న ధోరణులకు అనుగుణంగా సన్నద్ధంగా ఉండాలనీ రాష్ట్రపతి అన్నారు. అస్పష్టతలతో కూడిన, సాంప్రదాయక–ఇతర యుద్ధ తంత్రాలన్నింటినీ అవలంబిస్తున్న ప్రస్తుత తరుణంలో కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్మెంట్ వంటి సంస్థలు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. కాలానుగుణంగా తమ సామర్థ్యాలను మెరుగుపరచుకోవాలనీ, శరవేగంగా మారుతున్న రక్షణ రంగంలో అత్యున్నత స్థితికి చేరుకునేలా కృషిచేయాలని ఆమె కోరారు.

బహుపాక్షిక ఆర్థిక, సైనిక ఏర్పాట్లు, భాగస్వామ్యాల ద్వారా ప్రాంతీయ, అంతర్జాతీయ రక్షణ చర్చలలో భారత ప్రాబల్యం విశేషంగా పెరిగిందని రాష్ట్రపతి అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో భారత రక్షణ సామర్థ్యాలు దేశ బలాన్నీ, పురోగామి దృక్పథాన్ని ప్రతిబింబిస్తాయి. స్వావలంబన, సాంకేతిక పురోగతి, వ్యూహాత్మక సహకారాలపై ప్రత్యేకంగా దృష్టిసారించడం ద్వారా.. భారత్ తన సరిహద్దులను రక్షించుకోవడమే కాకుండా, అంతర్జాతీయ శాంతి, స్థిరత్వాలకు కూడా దోహదం చేస్తోంది.

# కువైట్ పర్యటనకు ముందు ప్రధాని నిష్క్రమణ ప్రకటన

న్యూఢిల్లీ, డిసెంబర్ 21:ఈ రోజు, కువైట్ రాష్ట్ర అమిర్ హిస్ హైనెస్ షేక్ మెషల్ అల్–అహ్మద్ అల్–జాబర్ అల్–సబాహ్ ఆహ్వానం మేరకు నేను రెండు రోజుల కువైట్ పర్యటనకు బయలుదేరుతున్నాను.

కువైట్‌తో తరతరాలుగా పెంపొందించుకున్న చారిత్రాత్మక సంబంధానికి మేము ఎంతో విలువ ఇస్తున్నాము. మేము కేవలం బలమైన వాణిజ్యం మరియు ఇంధన భాగస్వాములమే కాదు, పశ్చిమాసియా ప్రాంతంలో శాంతి, భద్రత, స్థిరత్వం మరియు శ్రేయస్సుపై ఆసక్తిని పంచుకున్నాము.

నేను హిస్ హైనెస్ అమిర్, క్రౌన్ ప్రిన్స్ మరియు కువైట్ ప్రధాన మంత్రితో నా సమావేశాల కోసం ఎదురుచూస్తున్నాను. మన ప్రజలు మరియు ప్రాంత ప్రయోజనాల కోసం భవిష్యత్ భాగస్వామ్యం కోసం రోడ్‌మ్యాప్‌ను రూపొందించడానికి ఇది ఒక అవకాశం.

రెండు దేశాల మధ్య స్నేహ బంధాలను బలోపేతం చేసేందుకు అపారంగా దోహదపడిన కువైట్‌లోని భారతీయ ప్రవాసులను కలవాలని నేను ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను.

గల్ఫ్ ప్రాంతంలోని ప్రధాన క్రీడా కార్యక్రమం అయిన అరేబియన్ గల్ఫ్ కప్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి నన్ను ఆహ్వానించినందుకు కువైట్ నాయకత్వానికి నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

# డ్రైవర్లు కంటి సమస్యలపై అప్రమత్తంగా ఉండాలి.. అరుణ్ కుమార్




అమరావతి, డిసెంబర్ 21: భారత్ గ్యాస్ ఎల్పీజీ టెరిటరీ గ్యాస్ ఫిల్లింగ్ ప్లాంట్, బాలసాయి కంటి ఆసుపత్రి, లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూల్ మెల్విన్ జోన్స్, జిల్లా వయోవృద్ధుల సంక్షేమ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో వాహన డ్రైవర్లకు, ఇతర కార్మికులకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ ఉచిత కంటి వైద్య శిబిర ప్రారంభ కార్యక్రమంలో భారత్ గ్యాస్ ఎల్పీజీ టెరిటరీ ప్లాంట్ మేనేజర్ అరుణ్ కుమార్ మాట్లాడుతూ కంటి పనితీరును మెరుగు పరిచే పోషకాహారం, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవా లన్నారు.

కంటి వైద్య నిపుణులు లయన్ డా. జయప్రకాష్ మాట్లాడుతూ నేటి డిజిటల్ కాలంలో కంప్యూటర్, మొబైల్ తో పాటు ఇతర ఎలక్ట్రిక్ గాడ్జెట్స్ ఎక్కువగా ఉపయోగించడం వల్ల కంటి సమస్యలు ఎక్కువయ్యాయని, డ్రైవింగ్ లో ఉన్న వాళ్ళు మొబైల్ వాడకాన్ని తగ్గించాల న్నారు. శారీరక వ్యాయామంతో పాటు కంటి వ్యాయామం కూడా చేయడం వల్ల కంటి రక్తనాళాలు యాక్టివ్ రక్త ప్రసరణ బాగా జరిగి కళ్ళు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. లయన్స్ మాజీ అడిషనల్ జిల్లా క్యాబినెట్ సెక్రటరీ లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. వాహనాల రద్దీ ఎక్కువ కావడం వల్ల అధిక కాలుష్యం తో తరచూ కళ్ల సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డి.నాగరాజు మాట్లాడు తూ.. వాహన దారులు టీ, కాఫీ, ఆల్కహాల్ లాంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. భారత్ గ్యాస్ రీజినల్ ఫిల్లింగ్ నేషనల్ స్టేషన్ ఆపరేషన్స్ మేనేజర్ లతీఫ్ మాట్లాడుతూ.. ఖాళీ సమయంలో తగినంత విశ్రాంతి నిద్రకు ప్రాధాన్యత నివ్వాలన్నారు. వైద్య శిబిరంలో 100 మందికి పైగా వాహన డ్రైవర్లు, ఇతర సిబ్బందికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు, కంటి అద్దాలు ఉచితంగా పంపిణీ చేశారు.



